ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025


రాయచోటి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో విజయలక్ష్మీదేవి అలంకారం


ఒంటిమిట్టలో కన్యకాపరమేశ్వరి అలంకారం


మహిషాసురమర్దినిగా రెడ్డెమ్మ అమ్మవారు


రాజంపేటలో మహాలక్ష్మీదేవి అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి

వాసవీమాత... ఆదుకోవమ్మా..!.

● కనుల పండువగా దసరా ఉత్సవాలు


మదనపల్లెలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరీదేవి


రాయచోటి వీరభద్రాలయంలో భవానిదేవి అలంకారం

రాయచోటిటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో 10వ రోజు బుధవారం ఆయా ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో భవానీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో విజయలక్ష్మీదేవి అలంకారం, పాతరాయచోటిలోని ప్రాచీన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో భవానీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఇక ఒంటిమిట్ట వాసవీమాత కన్యకాపరమేశ్వరి అలంకారంలో, గుర్రంకొండ రెడ్డెమ్మ అమ్మవారు మహిషాసురమర్దినిగా, పీలేరు వాసవీమాత మహాచండీ అలంకారంలో, మదనపల్లె కన్యకాపరమేశ్వరీదేవి రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు విరివిగా అమ్మవార్లను దర్శించుకొని వేడుకొన్నారు.


మహాచండీ అలంకారంలో పీలేరు వాసవీమాత

పవిత్రోత్సవం చూతము రారండి

● 4 నుంచి పట్టాభిరాముడి వైభవం
● టీటీడీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు


పవిత్రోత్సవాలకు ముస్తాబైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడు

వాల్మీకిపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో అక్టోబరు 4 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ప్రతి ఏటా నిర్వహించే ఈ పవిత్రోత్సవాలు మునుపటి కంటే మెరుగ్గా ఉండేలా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో చలువ పందిళ్ల ఏర్పాటు, విద్యుత్ దీపాలంకరణలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 4వ తేది శనివారం సాయంత్రం అంకురార్పణ, 5న ఉదయం యాగశాల వైదిక కైంకర్యాలు, ప్రవిత్ర ప్రతిష్ఠ, స్నపన తిరుమంజనం, 6న పవిత్రాల సమర్పణ, సాయంత్రం యాగశాల వైదిక కైంకర్యాలు, 7న మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్ర వితరణ, చక్రస్నానం, సాయంత్రం తిరువీధి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల అనంతరం పవిత్ర మాల, టీటీడీ తీర్థ ప్రసాదాలు, అందజేస్తామని ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజులు తెలిపారు.

తప్పు చేసిన వారికి రెడ్‌బుక్

● మిథున్‌రెడ్డికి వైట్ పేపర్ ఇవ్వలేదు
● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వారికి రెడ్‌బుక్ ఉంటుందని, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి లిక్కర్ కేసులో వైట్ పేపర్ ఏమీ ఇవ్వలేదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఆయన స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మిథున్‌రెడ్డి కేవలం బెయిల్ పైనే వచ్చారని, రాబోవు రోజుల్లో పెద్ద శిక్ష అనుభవిస్తారన్నారు. మిథున్‌రెడ్డి, ఆయన తండ్రి ఏ తప్పులు చేయకపోతే వారికి ఈ దౌర్భాగ్యం ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు. సొంతంగా నాశిరక మద్యాన్ని తయారు చేసి రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాల్లో విషాదం మిగిల్చింది మీ కుటుంబం కాదా అని ప్రశ్నించారు. లిక్కర్ కేసులో మీ బినామీలు జైల్లో ఊచలు లెక్కబెడుతున్నా ఎక్కడా పశ్చాత్తాపం కనబడడం లేదని ఎద్దేవా చేశారు. తప్పు చేసిన వారికి ఈ రాష్ట్రంలో రెడ్ బుక్ తప్పనిసరిగా అమలులో ఉంటుందన్నారు.

'ఇన్‌స్పైర్ నామినేషన్లలో జిల్లాకు మొదటి స్థానం'


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ కె.సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ అవార్డుల కోసం 3048 మంది విద్యార్థులతో వందశాతం నామినేషన్లు సమర్పించి రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని డీఈవో సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రితో నామినేషన్ల కార్యక్రమం ముగిసిందన్నారు. జిల్లాలో 625 ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలలు అన్ని తమ విద్యార్థులతో ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించాయన్నారు. నామినేషన్లు సమర్పించిన వారిలో 12 శాతం మంది విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం వారు అవార్డులు ప్రదానం చేస్తారన్నారు. ఎంపికైన ఒక్కొక్క విద్యార్థి బ్యాంకు ఖాతాలో ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి రూ.10 వేలు నగదు జమ చేస్తారని, విద్యార్థులను శాస్త్రీయ ఆలోచనల వైపు ప్రేరేపించడమే లక్ష్యమన్నారు. ఈ విజయం సాధించడానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయులకు, సైన్స్ ఉపాధ్యాయులకు, సహకరించిన మండల విద్యాశాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్


పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రామాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్పనాయునిచెరువు కస్పాలో బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఉదయం 7 గంటలకే స్వయంగా పరిశీలించారు. అప్పటికే సచివాలయ సిబ్బంది గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి బయోమెట్రిక్ ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దనే వేలిముద్రలు తీసుకుని పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులతో ఆయన స్వయంగా మాట్లాడారు. అనంతరం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన మామిడి చెట్లను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్ పేషెంట్‌గా ఉన్న వ్యక్తిని ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్సలు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డ్వామా పీడీ వెంకటరత్నం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జాషువా, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్పీ చొరవతో.. స్వగ్రామానికి బాధితురాలు


ఎస్పీకి కృతజ్ఞతలు తెలుపుతున్న బాధితురాలు

ములకలచెరువు/రాయచోటి టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కువైత్‌లో చిత్రహింసలకు గురవుతున్న బాధితురాలు ఎస్పీ ధీరజ్ కనుబిల్లి చొరవతో స్వగ్రామానికి చేరుకుంది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని రాయచోటిలో మంగళవారం ఎస్పీని ఆమె కలిసింది. ములకలచెరువు మండలం నాయనిచెరువుపల్లె పంచాయతీ పోకనాటివారిపల్లెకు చెందిన బత్తల రమణప్ప భార్య నాగవేణి కుటుంబ పోషణ కోసం కువైత్‌కు వెళ్లి అక్కడ చిత్రహింసలకు గురికావడంతో బోరున విలపిస్తూ వీడియో కుటుంబీకులకు పంపింది. దీనిపై ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో వార్త కూడా ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై తక్షణం స్పందించిన ఎస్పీ సంబంధించిన ఏజెంటుతో మాట్లాడి మహిళ ఇంటికి వచ్చేలా చూడాలని ములకలచెరువు ఎస్ఐ నరసింహుడును ఆదేశించారు. దీంతో ఎస్ఐ సత్యసాయి జిల్లా తనకల్లు మండలానికి చెందిన ఏజెంటు హరితో మాట్లాడి మహిళ నాగవేణి సురక్షితంగా స్వగ్రామానికి వచ్చేలా చేశారు. దీంతో బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పొందిన ఏజెంట్ల ద్వారానే ఇతర దేశాలకు ప్రయాణం చేయాలని, జిల్లా వాసులకు అక్కడ ఏదైనా ఇబ్బందులు వుంటే 918688830014ను సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి నూతన ఉపాధ్యాయులకు శిక్షణ



గ్రీన్‌వ్యాలీ హైస్కూల్లో ఏర్పాట్లకు సూచనలిస్తున్న డీవైఈఓ

మదనపల్లెటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాకు చెందిన 360 మంది కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు పొందిన వారికి రేపటి నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మదనపల్లె డీవైఈఓ లోకేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గ్రీన్‌వ్యాలీ హైస్కూల్లో నిర్వహిస్తున్న ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ డీఈఓ సుబ్రహ్మణ్యం ఆదేశాలతో కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వస్తున్న వారికి ఎనిమిది రోజులు ఇక్కడ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వీరికి కోర్సు డైరెక్టర్లుగా కరుణాకర్, పలువురు ఎంఈఓలు వ్యవహరిస్తారన్నారు. ఎనిమిది రోజుల పాటు ఇచ్చే శిక్షణకు తరగతి గదులు, ఇతర సౌకర్యాలను గుర్తించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌లు మహమ్మద్‌ఖాన్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువలో పడి యువకుడు మృతి



యువకుడి మృతదేహం

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాల్వలో పడి యువకుడు ఆర్. కిషోర్‌రెడ్డి(32) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటనపై బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల్లోకెళితే.... పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో కడప వాసి ఆర్.కిషోర్‌రెడ్డి స్టోర్ కీపర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల నుంచి కళాశాల సెలవులు ఇవ్వడంతో సోమవారం మధ్యాహ్నం మిత్రులతో కలిసి హంద్రీ-నీవా కాల్వ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృత్యువాత పడ్డాడు. స్థానికులు గమ నించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కడపలోని మృతుని బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కడపకు తరలిం చారు. పోలీసులను విచారించగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

జీఎస్టీ ఫలాలు అందాలి

● తిరుపతి రీజనల్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ సునీత



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి రీజనల్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్

రాజంపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో కలిగే లాభాలను అన్నివర్గాల వారికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తిరుపతి రీజనల్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, అన్నమయ్య జిల్లా జీఎస్టీ నోడల్ అధికారి సునీత సూచించారు. బుధవారం రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ భావన అధ్యక్షతన నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలోని అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేకూరేలా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందన్నారు. దీంతో దారిద్ర్యరేఖకు దిగువనున్న వర్గాలు సైతం మోటారు సైకిళ్లు, టీవీలు తదితరాలను చౌకధరలకు కొనుగోలు చేసుకునే అవకాశం లభించింద న్నారు. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను ప్రతి అధికారి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసిన అంశాలను, సమావేశ వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌కు నిప్పు పెట్టిన దుండగులు



దుండగులు నిప్పు పెట్టడంతో ట్రాక్టర్ ఇంజన్ కాలిపోయిన దృశ్యం

పెద్దమండ్యం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం రైతు తెచ్చుకున్న ట్రాక్టర్‌కు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టిన సంఘటన పెద్దమండ్యం మండలంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు మండలంలోని దిగువపల్లి వాసి దయానందరెడ్డి వ్యవసాయ అవసరాల కోసం ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. పనులు ముగించుకుని రోజువారీ ఇంటి సమీపంలో ట్రాక్టర్ నిలిపాడు. మంగళవారం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం నిద్ర లేచాడు. తన ట్రాక్టర్‌కు గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టి పరుగులు తీయడం గమనించి, ఆ మంటలను నీళ్లతో ఆర్పినట్లు బాధిత రైతు దయానందరెడ్డి బుధవారం పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దమండ్యం ఇన్‌చార్జ్, తంబళ్లపల్లి ఎస్ఐ ఉమా మహేశ్వర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూ టీమ్ ఆ ప్రాంతాన్ని తనిఖీ చేపట్టారు. ఈ సంఘనటపై పలు అంశాలపై పోలీసులు ఆరా తీశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పెద్దమండ్యం ఏఎస్ఐ ఇసాక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే అజెండా

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లెటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ కౌన్సిలర్ల అజెండాగా పనిచేస్తున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ తప్పుపట్టారు. బుధవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2021లో అధికార మదంతో మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను కనీసం నామినేషన్ కూడా వేయనీయకుండా అక్రమంగా అధికారంలోకి వచ్చిన వైసీపీ కౌన్సిలర్లు మూడేళ్ల పాటు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ మున్సిపల్ కాంట్రాక్టు పనుల్లో కాంట్రాక్టర్లను బెదిరించి వారి నుంచి కమిషన్లు దోచుకున్నారన్నారు. ఏడాదిన్నరగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే షాజహాన్‌బాష పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి పనులను అజెండాలో పెట్టిస్తుండడంతో వైసీపీ కౌన్సిలర్లు ఓర్వలేకపోతున్నారన్నారు. వరుసగా ఆరు నెలల నుంచి ఎమ్మెల్యే ప్రతిపాదించిన పనులను అజెండాలో వుంచినా వాటికి ఆమోదం తెలపకుండా వ్యతిరేకిస్తున్నారన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న వైసీపీ కౌన్సిలర్లు తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన ఐదు నెలలైనా ప్రజాసమస్యలు పరిష్కారం కోసం, అభివృద్ధి పనులు నిర్వహించేలా వైసీపీ కౌన్సిలర్లు సహకరించాలని, లేకుంటే వీరికి పట్టణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పరిహారం.. పరిహాసం

వేంపల్లె-రాయచోటి జాతీయ రహ దారిలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు అందజేసే పరిహారం.. పరిహాసంగా మారింది. రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్లు తప్పుగా నమోదు చేసుకో వడం.. కొందరికి చెప్పిన నగదు కంటే అకౌంట్లో తక్కువ జమ కావడంతో బాధితులు ఇళ్లు కూల్చేందుకు అంగీక రించడం లేదు. దీంతో జాతీయ రహ దారి పనులు పూర్తయ్యేనా.. అనే ప్రశ్న తలెత్తుతోంది.

- సర్వే నెంబర్ల తప్పిదం
- బాధితులకు సంకటం
- భూమి అప్పగిస్తే పనులు మొదలు పెడతామంటున్న ఎన్‌హెచ్ అధికారులు
- పరిహారం చెల్లించినంతవరకు ఇళ్లు కూల్చలేమంటున్న బాధితులు
- ఇదీ.. వేంపల్లె- రాయచోటి జాతీయ రహదారి దుస్థితి



పనులు జరగని జాతీయ రహదారి ఇదే..

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి నుంచి రాయచోటి వరకు 2020లో నేషనల్ హైవే రోడ్డు మంజూరైంది. ఇందుకుగానూ వేంపల్లి నుంచి రాయచోటి వరకు అక్కడక్కడ పనులు ప్రారంభించారు. అయితే రెండేళ్ల క్రితం కాంట్రాక్టర్ మృతి చెందడంతో పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్కిరెడ్డిపల్లెలోని జాతీయ రహదారికి ఇరుపక్కల ఇళ్లు, బోర్లు, స్థలాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం అంచనాల ప్రకారం లేఅవుట్ తయారు చేసింది. గతేడాది నుంచి లక్కిరెడ్డిపల్లె, కోనంపేట ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు ఉన్నత స్థాయి అధికారులకు నివేదికలు పంపించారు. కాగా ఇందులో కొందరికి తగిన ఫలితం లభించగా.. మరికొందరికి పరిహారం తక్కువ వచ్చిందని వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని అంటున్నారు.

చింతకుంటపల్లి గ్రామంలో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం తగిన పరిహారం ఇచ్చింది. అక్కడక్కడ పనులు ప్రారంభించారు. అయితే లక్కిరెడ్డిపల్లె గ్రామంలో కోర్టు నుంచి చింతకుంటపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం కొందరికే వచ్చింది. మరికొందరికి పరిహారం పడలేదని రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. లక్కిరెడ్డిపల్లెలో ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ 30 మంది లబ్ధిదారులకు పరిహారం అందలేదని ఆవేదన చెందుతున్నారు. ఇటు నేషనల్ హైవే కాంట్రాక్టర్లు, అధికారులు పనులు.. ఇళ్లు కూల్చేస్తే పనులు ప్రారంభిస్తామని అంటున్నారు. లబ్ధిదా రులు మాత్రం తగిన ఫలితం వచ్చేంత వరకు ఇళ్లు పడగొట్టమని తెగేసి చెబుతున్నారు. రామరాజు అనే వ్యక్తికి సర్వేనెంబర్ 90లో ఇళ్లు ఉండగా సర్వే నెంబర్ 91లో ఉందంటూ నమోదు చేసుకున్నారు. ఆయనకు ఇప్పటికీ పరిహారం అందడం లేదని తెలిపారు. ప్రభుత్వం వేసిన అంచనాల ప్రకారం డబ్బులు రాలేదని రెండు సెంట్లు స్థలం కోల్పోతే రూ.1,73,000 ఇచ్చారని, అలాగే రెండు మీటర్లు అని చెప్పి నాలుగు మీటర్లు తీశారని తెలిపారు. అమీర్ బాషా, రవిశంకర్‌లు మాట్లాడుతూ.. కొలతలు వేసింది ఒక చోట.. పడగొట్టేది మరో చోటని వాపోయారు. రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి అందరికీ పరిహారం అందించాలని కోరుతున్నారు.

ఇంతవరకు పరిహారం రాలేదు

- సుబ్బరాజు, లబ్ధిదారుడు, లక్కిరెడ్డిపల్లె



సర్వే నెంబర్ పొరపాటు వల్ల ఐదేళ్లుగా పరిహారం రాలేదు. నా ఇళ్లు సర్వే నెంబర్ 90లో ఉంది, 91లో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నివేదికలు పంపిం చారు. దీంతో ఇంతవరకు పరిహారం అందలేదు.

చెప్పినంత ఇవ్వలేదు

- రవిశంకర్, లబ్ధిదారుడు, లక్కిరెడ్డిపల్లె



ఇళ్లు కోల్పోయినప్పుడు ప్రభుత్వ అంచనాల ప్రకారం రెండు సెంట్లకు రూ.32 లక్షలు కేటాయించారు. అయితే నా ఖాతాలో రూ.26 లక్షలు మాత్రమే పడింది. మిగతా 6 లక్షలు ఇంతవరకు పడలేదు. పూర్తిగా పరిహారం పడితే ఇళ్లు పడగొడతా.

ప్రాణహాని ఉందంటూ.. మహిళ ధర్నా



భర్త మహబూబ్‌ఖాన్ ఇంటి ముందు ధర్నా చేస్తున్న జోయాఖాన్

మదనపల్లెటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): 'నా భర్త వేధింపులు భరించలేకున్నాను. రోజూ హింసిస్తూ వేధిస్తున్నాడు. ప్రశ్నిస్తే ఇంటి నుంచి బయటకు గెంటేసి, ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లి పోయా'డంటూ ఓ మహిళ భర్త ఇంటి ముందే ధర్నాకు దిగింది. బాధితురాలి కథనం మేరకు.. మదనపల్లె పట్టణం ఎన్‌వీఆర్ వీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా, నసీబ్‌జాన్ దంపతుల కుమార్తె జోయాఖాన్‌కు 12 ఏళ్ల కిందట మదనపల్లె వాసి మహబూబ్‌ఖాన్‌తో వివాహమైంది. ఎస్‌బీఐ కాలనీలో కాపురమున్న వీరికి షఫియాఖాన్ అనే కుమార్తె వుంది. ఈ క్రమంలో రెండేళ్లుగా మహబూబ్‌ఖాన్ ఇంటికి సక్రమంగా రాకపోవడమే కాక, మరో మహిళతో చనువుగా వుండటాన్ని అతని భార్య జోయా నిలదీసింది. అప్పటి నుంచి వీరి మధ్య గొడవలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మహబూబ్‌ఖాన్ తనను వీధిలోనే తీవ్రంగా కొట్టి ఇంటి నుంచి బయ టకు గెంటేశాడని ఆరోపించింది. అంతేకాకుండా ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లిపోయాడని బాధితురాలు జోయాఖాన్ బుధవారం భర్త ఇంటి ముందు ధర్నాకు కూర్చుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ తనను భర్త కుక్కకన్నా హీనంగా చూస్తున్నాడని, ప్రశ్నిస్తే చితకబాదుతున్నాడని వాపోయింది. ఈ విషయమై టూటౌన్ పోలీ సులకు ఫిర్యాదు చేస్తే భర్తతో సర్దుకుపోవాలని చెబుతున్నారని ఆవే దన వ్యక్తం చేసింది. తన భర్త ఓ టీడీపీ నేత ప్రధాన అనుచరుడిగా వున్నాడని, అందుకే తనను బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై టీడీపీ అధిష్ఠానం కలుగజేసుకుని తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

గండికోట నుంచి సాగునీరు : మంత్రి మండిపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచిందని, ఈ 16 నెలల్లో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో బుధవారం లక్కిరెడ్డిపల్లెలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 16 గ్రామ పంచాయతీల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 250 కోట్ల రూపాయలతో గండికోట నుంచి వెలిగల్లు ప్రాజెక్టుకు కాలువల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఆరు నియోజకవర్గాల్లోని చెరువులకు గండికోట నీరు అందించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. జల్‌జీవన్ పథకం ద్వారా రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. వెలిగల్లు కుడి, ఎడమ కాలువకు 150 కోట్ల రూపాయలతో మరమ్మతులు చేయిస్తామన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలానికి 16 నెలల్లో దాదాపు 30 కోట్లు ఖర్చు పెట్టి రోడ్లు, తాగునీరు అందించామన్నారు. ఎన్నికల ముందు లక్కిరెడ్డిపల్లె మండలానికి కోటి రూపాయల తన సొంత నిధులతో బోర్లు వేసి తాగునీరు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అటవీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగోళ్ల రెడ్డెయ్య, గాజుల ఖాదర్‌బాషా, మార్కెట్ యార్డు చైర్మన్ షఫీనాయక్, డీసీసీబీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ : మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెయ్య, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



మంగంపేటలో ఆర్‌ఎస్‌ఎస్ విజయదశమి విజయోత్సవ ఉత్సవాలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలంలోని మంగంపేట ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్త మర్రిపాటి వేణుగోపాల్ మాట్లాడుతూ సంఘ శతాబ్ది సందర్భంగా పంచ పరివర్తన ద్వారా సమాజంలో సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధన్, పౌరవిధులు, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ స్వావలంబన కార్యక్రమాలను ప్రతి గడపకు తీసుకెళ్లి ప్రతి భారతీయుడు ప్రపంచానికి మార్గదర్శకమయ్యేలా నిర్వహించే ఈ కార్యక్ర మాల్లో స్వయం సేవకులు తమవంతు కృషి చేయాలన్నారు. 70 వేలకు పైగా శాఖలతో, నాలుగు మిలియన్లకు పైగా స్వయం సేవకులతో కూడిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్జీవోగా ప్రసిద్ధి చెందిందని పులపత్తూరు రామసుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక స్వయం సేవకులు గల్లా ధనం జయ్య, ముక్కా రూపేశ్‌రెడ్డి, జగదబి కేశవరాజు, సుబ్రహ్మణ్యం రాజు, తొండం చంద్రశేఖర్, దరిశా వెంటరెడ్డి, సుగవాసి మల్లికార్జున, సుబ్బరాయుడు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు జీవీ శ్రీనాథరెడ్డి గుడ్‌బై



జీవీ శ్రీనాథరెడ్డి

పీలేరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తాను రాజకీయాలకు తప్పుకుంటున్నట్లు పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి బుధవారం ప్రకటించారు. పీలేరు కోటపల్లెలోని ఆయన స్వగృహంలో బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లా డుతూ ఆరోగ్య, ఇతరత్రా కారణాల కారణంగా రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. తండ్రి, పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ చంద్రశేఖర రెడ్డి నుంచి రాజకీయ వారసత్వం అందిపుచ్చుకున్న జీవీ శ్రీనాథరెడ్డి న్యాయవాది వృత్తి నుంచి రాజకీయాల్లో ప్రవేశించారు. చిన్నగొట్టిగల్లు సమితి అధ్యక్షుడిగా, చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్‌గా, 1994-1999 మధ్య పీలేరు ఎమ్మెల్యేగా పనిచేశారు. రాష్ట్ర సెరికల్చర్ బోర్డు అధ్యక్షులుగా, ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్‌గా పనిచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పని చేశారు. సౌమ్యుడు, వివాహరహితుడిగా పేరొందిన ఈయన టీడీపీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆ పార్టీకి పెద్దదిక్కులా వ్యవహరించారు. అయితే 2012లో టీడీపీ వీడి అప్పటి సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఆయన మరలా 2015లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం 2021లో వైసీపీలో చేరారు. అప్పటి నుంచి గత సార్వత్రిక ఎన్నికల వరకు వైసీపీలో చురుగ్గా వ్యవహరించిన ఆయన ఎన్నికల ఫలితాల తరువాత నిస్తేజంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు బుధవారం ప్రకటించారు.



పుల్లంపేట సమీకృత వసతి గృహం

స్వచ్ఛ హాస్టల్‌గా పుల్లంపేట బాలుర హాస్టల్

పుల్లంపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేటలోని సమీకృత బాలుర వసతి గృహం రాష్ట్రస్థాయిలో స్వచ్ఛహాస్టల్‌గా ఎంపికైనట్లు వార్డెన్ తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆన్‌లైన్ ద్వారా సమాచారం అందినట్లు ఆయన అన్నారు. కాగా సంబంధిత అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన కిశోర్‌కుమార్‌రెడ్డి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరు, ఎస్పీగా బాధ్యతలను చేపట్టిన అధికారులను బుధవారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి రాయ చోటిలో కలిశారు. మొదట కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని సమస్యలు, అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ప్రధానంగా నియో జకవర్గానికి హంద్రీనీవా నీళ్లు రాకుండా అడ్డంకిగా వున్న శ్రీనివాస పురం జలాశయం కాలువలకు అవసరమైన కేవలం ఆరు ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అడవిపల్లె రిజర్వాయర్‌కు నీటిని చేర్చేందుకు అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని ఆయన కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ చిన్న సమస్య పరిష్కారమైతే నియోజకవర్గంలోని 85 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల్లో మంచి స్పందన వుందన్నారు. అనంతరం ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని కలిసి అభినంద నలు తెలిపారు. నియోజకవర్గంలోని శాంతిభద్రతల నిర్వహణ గురించి ప్రధానంగా చర్చించారు.

రెండు బైకులు ఢీ - ముగ్గురికి గాయాలు



రోడ్డుపై పడి ఉన్న బైకులు

రైల్వేకోడూరురూరల్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవ రాజు పురం పంచాయతీ గంగరాజుపురం ప్రధాన జాతీయ రహ దారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ముగ్గురు గా యపడ్డారు. స్థానికుల వివరాల మేరకు రామయ్య, సుజాత దంపతులు బైకుపై కోడూరు వైపు వస్తుండగా సుబ్బరాయుడు అనే వ్యక్తి మరో బైకులో రాజంపేట వైపు వెళుతూ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయ పడ్డారు. స్థానికులు గాయపడిన వారిని 108 వాహనంలో కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

సర్పంచ్‌పై కేసు నమోదు

నిమ్మనపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏపై దాడి చేసి గాయపరిచిన సర్పంచ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పే స్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాచవేటి వారిపల్లి పంచాయతీ మాదిగపల్లి సమీప కొత్త చెరువులో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు తేకుండా మట్టిని టిప్పర్ల తో తరలిస్తుండగా సర్పంచ్ సుబ్రమణ్యం (అలియాస్ మధు) అక్క డకు చేరుకుని అనుమతులు లేనిదే మట్టి తరలించవద్దని వారిని అక్కడి నుంచి వెళ్లి పోవాలన్నారు. అప్పటికే టిప్పర్‌కు సగం లోడు మట్టివేసి వుండగా వెళ్లిన వీఆర్‌ఏ వెట్టి క్రిష్ణప్ప టిప్పర్‌లో సగం వున్న మట్టిని తాను నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద దింపివేయాలని తెలిపాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాదోప వాదాలు జరిగి ఆవేశంతో వీఆర్‌ఏపై సర్పంచ్ బాలసుబ్రహ్మణ్యం దాడి చేశాడు. దాడిలో వీఆర్‌ఏ తలకు తీవ్రగాయమైనట్లు తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు అందడంతో సర్పంచ్ సుబ్రమణ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

నల్లగుట్టను మేతకు కేటాయించండి

● మూడు గ్రామాల రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నపం

మదనపల్లెటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ పరిధిలోకి వచ్చే నల్లగుట్టకు పశువుల మేతకు కేటాయించాలని మూడు గ్రామాల రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు మాట్లాడుతూ దశాబ్దాలుగా అంకిశెట్టిపల్లె, వేంపల్లె, తుమ్మల తండాకు చెందిన రైతులు వారి పశువుల మేతకోసం నల్లగుట్టపైకి తోలుతున్నామన్నారు. ఇటీవల కొందరు అక్కడ బుద్దుడి విగ్రహం పెట్టి తమ పశువులను అక్కడికి రానీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ నల్లగుట్టను పశువుల మేతకు తప్ప ఇతర కార్య క్రమాలకు అనుమతించవద్దని రైతులు కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు రెడ్డెప్ప, సుబ్రమణ్యం, రమణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌ను ఆశ్రయించిన మూడు గ్రామాల రైతులు

వర్షానికి ఎండక.. ధర లేక...!

మొక్కజొన్న రైతుల అవస్థలు వర్ణనాతీతం

మొక్కజొన్న విత్తనాలను రోడ్డుపై ఆరబోసిన దృశ్యం



రాజుపాలెం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగైన మొక్కజొన్న పంట కోత దశకు వచ్చేసరికి రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. కోసిన పంటను ఎండబెట్టుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. గత మూడురోజులుగా తుపాను ప్రభావంతో మేఘావృతమై వర్షపు జల్లులు పడు తుండడంతో పండి పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. రోడ్లపై తెచ్చి మొక్కజొన్నలను ఆరబోసి వర్షం వచ్చినపుడు పట్టలు కప్పుకోవడం, వర్షం పోగానే ఆరబోసు కుంటూ అష్టకష్టాలు పడుతున్నారు.

రాజంపాళెం మండలంలోని టంగుటూరు, దువ్వూ రు మండలంలోని జిల్లెళ్ల, భాకరాపేట గ్రామాల్లో రైతులు దాదాపు 400 ఎకరాలు పైబడి మొక్కజొన్న పంట సాగు చేశా రు. ఎకరాకు రూ.15వేలు కౌలు, విత్తనాలు, ఎరువులు దాదాపు రూ.35వేలు ఖర్చు వస్తుందని తెలిపారు. అయితే ఎకరాకు 18 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, సరైన గిట్టుబాటు ధర లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. క్వింటా రూ.1800 నుంచి రూ.2వేలుకు అడుగుతున్నారని వాపోతున్నారు. తక్కువ రేటుకు కొనడానికి విత్తనాలు వర్షంలో మెత్తగా ఉండడం, ఆరకపోవడం, తగిన గిట్టుబాటు ధర లేకపోవడమే కారణమని రైతులు తెలుపుతున్నారు. ఈ ధరకు అమ్ముకుంటే నష్టం తప్ప లాభం ఏమీ ఉండదని చెబుతున్నారు. పంట పూర్తిగా ఆరాలంటే కనీసం మూడు, నాలుగు రోజులు పడుతుందని, ఇలా మబ్బులు ఉంటే నష్టాలు తప్పవని రైతులు అంటున్నారు.

గిట్టుబాటు ధర కల్పించండి

ప్రభుత్వం మద్దతుధర రూ.2400కు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే పంట ను కొనుగోలు చేసేందుకు అధికారులు రావడం లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికే దాదాపు 50 ఎకరాలు కోత జరిగిందని, మరో వంద ఎకరాలకు పైబడి పంటను కోయాల్సి ఉందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అమ్మానాన్నను కోల్పోయిన చిన్నారులకు ఐసీడీఎస్ బాసట



చిన్నారులను పరామర్శిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

దువ్వూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో అమ్మానాన్నను కోల్పోయి అనాథలుగా మారిన యశ్వంత్, లక్ష్మి అనే చిన్నారులకు ఐసీడీఎస్ అధికారులు బాసటగా నిలిచారు. బుధవారం శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రమాదేవి వారి సిబ్బందితో కలిసి బాధితుల పాప బాలరంగడును కలిశారు. చిన్నారుల చదువు బాధ్యత మా శాఖ తీసుకుంటుందని చెప్పారు. అధికారి వెంట సీడీపీవో ముంతాజ్‌బేగం, డీసీటీవో సుబాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి పాల్గొన్నారు. కాగా, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు బుధవారం చైతన్య హైస్కూలు పూర్వ విద్యార్థులు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆ మొత్తాన్ని వీరి కుటుంబీకులకు కోనేటి హరి, బాష, శివ, రమణారెడ్డిలు ఈసాయం అందజేశారు.

జీఎస్టీ 2.0 సంస్కరణలతో రైతులకు భారీ ప్రయోజనం

● అవగాహన సదస్సులో వ్యవసాయశాఖ, జీఎస్టీ అధికారులు



జీఎస్టీ 2.0 సంస్కరణల కరపత్రాలను చూపుతున్న వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ తదితరులు

కడప రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా వ్యవసాయ రంగంలో రైతులకు భారీ ప్రయోజనాలు కలగనున్నాయని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు బి.చంద్రానాయక్, జీఎస్టీ సంయుక్త కమిషనర్ సుమతి పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం అన్ని మండలాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా కడప నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ రేట్లను గణనీయంగా తగ్గించాయన్నారు. దీని వలన రైతుల సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులపై పన్ను భారం తగ్గడం వలన కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి రైతు ఈ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీఎస్టీ సంయుక్త కమిషనర్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలలో భాగంగా ట్రాక్టర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు, ఇతర వ్యవసాయ యంత్రాలపై 18 శాతం నుంచి 5 శాతానికి, ఎరువులు పురుగుమందులు, బయో పెస్టిసైడ్స్‌పై 12 శాతం నుంచి 5 శాతానికి పన్ను తగ్గించడం జరిగిందన్నారు. ఇది దేశంలోనే వ్యవసాయ రంగానికి ఒక చారిత్రక సంస్కరణ అన్నారు. ఏపీఎంఐపీ పీడీ మాట్లాడుతూ నీటిపారుదల పరికరాలైన స్ప్రికంర్లు, బిందు సేద్యం పరికరాలు, ఇతర నీటిపారుదల పంపులపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతం వరకు పన్ను తగ్గించారన్నారు.

ఆకట్టుకున్న వ్యవసాయ ఉపకరణాల ప్రదర్శన

బయో-ఎరువులు, స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల ప్రదర్శన రైతులను ఆకట్టుకుంది. స్టాళ్లలో జీఎస్టీ 2.0 తగ్గింపునకు ముందు తరువాత ధరల వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపించే బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను రైతులు ఆసక్తిగా తిలకించి పన్ను తగ్గింపు వలన కలిగే ప్రత్యక్ష ప్రయోజనాలను అర్థం చేసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధశాఖల జిల్లా అధికారులు, ఏడీఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

5న దివ్యాంగ క్రీడాకారులకు ఈత పోటీలు

కడప మారుతీనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ స్టేడియంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఆదివారం దివ్యాంగ క్రీడాకారులకు ఈత పోటీలు నిర్వహించనున్నారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి వెల్లడించారు. ఆసక్తి గల దివ్యాంగ క్రీడాకారులు ఈనెల 4లోపు నమోదు చేయించుకోవాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 12న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9000672017, 6302277551, 9963194010 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

టెంకాయల విక్రయానికి రేపు వేలం

చక్రాయపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో ఈనెల 3వ తేదీ టెంకాయలు విక్రయించుకునే హక్కు కోసం సీల్డ్ టెండర్లు/ బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.10లక్షలు డిపాజిట్ నగదుగా కానీ, డీడీ ద్వారా గానీ చెల్లించి టెండర్‌లో పాల్గొనాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతాంగానికి ఊరట



వ్యవసాయ పనిముట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది

జమ్మలమడుగు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రైతాంగానికి భారీగా ఊరట నిచ్చిందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ సమావేశం నిర్వహించారు. ముందుగా వ్యవసాయానికి సంబంధించి పనిముట్లను, ఇతర వస్తువులను వ్యవసాయాధికారులు ప్రదర్శనగా పెట్టారు. వాటిని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పరిశీలించి ధరలు అడిగి తెలుసు కున్నారు. గతంలో ఎంత ధర ఉండేది, జీఎస్టీ తగ్గింపుతో ఎంత ధర తగ్గిందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుకు చేయూతనిచ్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం భారీగా జీఎస్టీ తగ్గించిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ అనిత, ఏవో శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, వైస్‌చైర్మన్ పొన్నతోట మల్లికార్జునరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





జయప్ప మృతదేహం, జయప్ప (ఫైల్)

లింగాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పట్ల సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం, ఐచర్ వాహనం పరస్పరం ఢీకొనడంతో ఎం.జయప్ప (58) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన జయప్ప పులివెందుల నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. అదే సమయంలో సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామం నుంచి పులివెందులకు చీనీకాయల లోడుతో వస్తున్న ఐచర్ వాహనం ఇప్పట్ల సమీపంలో మలుపు వద్దకు రాగానే ఢీకొంది. ఈ ప్రమాదంలో జయప్ప మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు, వృద్ధుల పోషణను విస్మరిస్తే జైలుశిక్ష

● సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, వృద్ధుల పోషణను విస్మరిస్తే వృద్ధుల సంక్షేమ చట్టం 2007 ప్రకారం శిక్షార్హులవుతారని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ 1984లో మొదటిసారి వృద్ధుల గురించి అంతర్జాతీయ సదస్సు నిర్వహించిందన్నారు. సీనియర్ సిటిజన్ అనే పదం కూడా ఇదే సదస్సులో మొదటిసారిగా వచ్చిందన్నారు. ఆ తరువాత 1991 అక్టోబర్ 1న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారన్నారు. వృద్ధుల సహకారాన్ని గుర్తించడానికి, వీరి జీవితాన్ని ప్రభావితం చేసే సమస్యలను పరిశీలించడానికి ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 వృద్ధులకు రక్షణగా ఉంటుందన్నారు. సీనియర్ సిటిజన్లకు, వృద్ధులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాల ద్వారా వారికి లబ్ధి చేకూరేలా చేయాలన్నారు. లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం ద్వారా సహాయపడాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సీనియర్ సిటిజన్లు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో పులివెందుల జేసీజే కోర్టు జడ్జి



స్వామివారిని దర్శించుకుంటున్న జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులు

తంబళ్లపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ మల్లికార్జునస్వామిని బుధవారం కడప జిల్లా పులివెందుల జేసీజే కోర్టు జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. బుధవారం జడ్జి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు జడ్జికి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

పాముకాటుకు యువకుడు...

పోరుమామిళ్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డి కుంట వద్ద పాము కాటేయడంతో జబరిక సురేశ్ (29) అనే యువకుడు మృతి చెందాడు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన సురేశ్ పోరుమామిళ్ల మండలంలోని ఓ కన్‌స్ట్రక్షన్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. మంగళవారం రాత్రి రేకులషెడ్డులో నిద్రిస్తుండగా కట్ల పాము కాటేసింది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి కడపకు తరలించారు. అయితే అప్పటికే అతను చనిపోయాడని డాక్టరు ధ్రువీకరించారు. బుధవారం మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

నా భూమిని ఆక్రమించుకోవాలని బెదిరిస్తున్నారు

● న్యాయం చేయాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు పత్రాలు చూపుతున్న రామాంజనేయులు

పులివెందుల రూరల్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): తనకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆక్రమించుకునేందుకు బెదిరిస్తున్నారని పులివెందుల పట్టణానికి చెందిన జేసీ రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పులివెందుల ఆర్డీఓ చిన్నయ్యను కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలంలోని గుండ్లమడుగు రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 514/3లో 0.32 ఎకరాలు, 515/1లో 1.29ఎకరాలు, 519/3లో 1 ఎకరా మొత్తం 2.61ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమి తనకు వారసత్వంగా సంక్రమించిందన్నారు. పోరు మామిళ్ల మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన నాగులు గాళ్ల సుజాత ఆమె కుటుంబ సభ్యులు ఈ భూమి మాది అని దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఆ భూమికి సంబం ధించిన అన్ని పత్రాలు తన వద్ద ఉన్నాయని.. తనకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు ఆర్డీవో విచారణ చేసి న్యాయం చేస్తామని తెలిపారు.

60 ఏళ్లు దాటినా విధుల్లో..

● జీతాల రికవరీకి కమిషనర్ ఆదేశాలు

ప్రొద్దుటూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పలువురు పదవీ విరమణ వయస్సు 60 ఏళ్లు దాటినా విధుల్లో కొనసాగుతూ ఏళ్ల తరబడి జీతాలు పొందుతున్నారు. ఇలా పనిచేస్తున్న వారు 14 మంది ఉన్నట్టు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి గుర్తించారు. ఆయన వెంటనే వీరందరికి జీతాలు నిలపమని ఆదేశించినా కొందరు ఉద్యోగులు సెప్టెంబరు నెల వరకు జీతాలు చేశారు. దీంతో కమిషనర్ ఆయా సెక్షన్ల హెడ్ గుమాస్తాలను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవీ విరమణ వయస్సు దాటినప్పటి నుంచి పొందిన జీతం రికవరీ చేయాలని లేదంటే మీ మీద చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. నోటీసులు జారీ చేసి వారందరినీ తొలగించాలని ఆదేశించారు. కాగా.. వారు ఎప్పుడు పదవీ విరమణ పొందుతారో తెలిసి కూడా శానిటరీ ఇన్‌స్పెక్టర్ల దగ్గర నుంచి ఎఫ్1 సెక్షన్ గుమాస్తాల వరకు అందరూ కప్పి పుచ్చారని ఆరోపణలు ఉన్నాయి.

పొలం ఇప్పిస్తానని మోసం... కేసు నమోదు

పోరుమామిళ్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పొలం ఇప్పిస్తానని మహిళను మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా... మండలంలోని సుంకేసులపల్లెకు చెందిన భాగ్యలక్ష్మి అనే మహిళకు ఎం.చెన్నయ్య అనే వ్యక్తి కాశినాయన మండలం బాలాయపల్లె గ్రామ పొలాల్లో ఒకటిన్నర ఎకరా పొలం ఇప్పిస్తానని నమ్మించి రూ.5లక్షలు డబ్బులు తీసుకున్నాడు. ఇప్పటికీ పొలం కానీ డబ్బులు కానీ ఇవ్వకపోవడంతో బాధితురాలు భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు చెన్నయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైద్యుల సమస్యలను పరిష్కరించండి

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం కడపనగర కార్యదర్శి రామమోహన్ అన్నారు. బుధవారం కడప నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యులు దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

వీరపునాయునిపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉల్లి రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీరైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి మల్లికార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో వేల ఎకరాల్లో ఉల్లిపంట సాగుచేశారన్నారు. అయితే కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులకు హెక్టార్‌కు రూ.50వేలు నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఉల్లి రైతులను ఆదుకోని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నేడు గాంధీజీ జీవిత సందేశంపై

ఛాయాచిత్ర ప్రదర్శన

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):గాంధీ జయంతిని పురస్కరించుకొని, జన విజ్ఞాన వేదిక, సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐటీఐ సర్కిల్ గాంధీ మండపంలో గురువారం గాంధీజీ జీవిత ఘట్టాలు,జీవిత సందేశం, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయనపాత్ర, వర్తమాన ప్రపంచంలో ఆయన ఆవశ్యకతను ప్రతిబింబించే ఛాయాచిత్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు సమీర్ బాష, సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని,గాంధీజీ సూత్రాలను మరింతగా అవగాహన చేసుకోవాలని కోరారు.

చెత్త సేకరణ వందశాతం జరగాలి

● కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ వందశాతం జరగాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కడప నగరం మార్నింగ్ విజిట్‌లో భాగంగా వెస్ట్‌జోన్‌లో పర్యటించారు. 49,50 డివిజన్‌లను సందర్శించి స్థానికులతో మాట్లాడుతూ రోజువారీగా చెత్త సేకరణపై వివరాలు తెలుసుకున్నారు. స్థానికులు తమ సమస్యలను కమిషనర్‌కు వివరించారు.


ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణలు



ప్రొద్దుటూరు ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకారం



కడప చౌడేశ్వరిదేవస్థానంలో రాజరాజేశ్వరిదేవి అలంకారం



కడప : ధాన్యలక్ష్మి అలంకారంలో అమ్మవారు



ప్రొద్దుటూరు శివాలయంలో గాయత్రీదేవి అలంకారం




కడప అమ్మవారిశాలలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు











జయ శుభకారిణీ.. విజయరూపిణీ..



రైల్వేకోడూరు: కాళింగమర్దినిగా వాసవి



రాజంపేట మీనాక్షిగా చౌడేశ్వరి





నందలూరు, రైల్వేకోడూరులో అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు



రాయచోటి: భవానీ అలంకారంలో దాక్షాయణి



గాలివీడు: గాజుల అలంకారంలో దుర్గామాత

రాజంపేట టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం కన్యకాపరమేశ్వరి మహాలక్ష్మి అలంకరణలో, చౌడేశ్వరి మీనాక్షిగా, సాధు కామాక్షమ్మ విశాలాక్షిగా, ఉదయగిరి యల్లమ్మ అదే అలంకారం లో అభయ మిచ్చారు.వెంకటరాజంపేట మహేశ్వరాలయంలో కనకదుర్గ మీనాక్షి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రైల్వేకోడూరు: పట్టణంలో కన్యకాపరమేశ్వరి కాళింగమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకుడు శరవణ , ఆలయ కమిటీ చైర్మన్ గునిశెట్టి రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.

రాయచోటిటౌన్ : పట్టణంలోని వీరభద్రాలయంలో అమ్మవారు భవానిఅలంకరణలో దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి విజయలక్ష్మిగా, అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు భవానిగా, తోపు గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు.

రాయచోటి-నేతాజీ సర్కిల్: రాయచోటి చెక్‌పోస్టు ఉమామహేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మి గా దర్శనమిచ్చారు,

గాలివీడు: మండలంలోని గుండ్లచెరువు పంచాయతీ పసుపుల వాండ్లపల్లెలో దుర్గామాత సిద్ధిధాత్రిగా దర్శన మిచ్చారు.

ఒంటిమిట్ట : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మ వారు వాసవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్‌బాబు, తుమ్మల పెంట శ్రీనివాసులు, రెంటాల హరిక్రిష్ణ, లోకేష్ పాల్గొన్నారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అగ్నిగుండంలో నడిచి మొక్కులను తీర్చుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యంబలూరు నరసింహస్వామి, ఉపాధ్యక్షుడు మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహశ్రేష్ఠి, సెక్రటరి గెలివి నాగసురేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ట్రూఅప్ చార్జీలు తగ్గించిన ఘనత చంద్రబాబుదే..'

ఒంటిమిట్ట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యుత్ ట్రూఅప్ చార్జీలు తగ్గించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం సిద్దవటం మండలంలోని టక్కోలి గ్రామంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పది రెట్లు పెంచగా, కూటమి ప్రభుత్వంలో ట్రూఅప్ చార్జిలను తగ్గిస్తోందన్నారు. గత ప్రభుత్వం ప్రతి వస్తువుపై భారీగా ధరలు పెంచి పేదలపై భారం మోపగా, ప్రస్తుతం ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి ప్రతి ఇంటికి వేలాది రూపాయల ఆదాయం సమకూర్చుతోందన్నారు. తి తక్కువ కాలంలోనే మెగా డీఎస్సీ నిర్వహించిన ఘనత రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు దక్కుతుందన్నారు. అంతకుముందు చౌకదుకాణాన్ని ప్రారంభించారు. తర్వాత గ్రామంలోని రామాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, సిద్దవటం మండల నాయకులు నాగమునిరెడ్డి, వెంకటసుబ్బయ్యతో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



చౌకదుకాణాన్ని ప్రారంభిస్తున్న చమర్తి

ఎంపీడీవోగా విజయరావు బాధ్యతల స్వీకరణ

ఓబులవారిపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) :ఎంపీడీవోగా సగిలి విజయరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత ంలో ఇక్కడే పని చేసిన ఈయన గత ఏడాది పెనగలూరు మండలానికి బదిలీపై వెళ్లారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో బదిలీ కావడంతో ఆయన తిరిగి ఓబులవారిపల్లెకు వచ్చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి సూపర్ జీఎస్టీ, పి4 అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'రేషన్ బియ్యం లెక్కల్లో తేడాలు ఉంటే చర్యలు'

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీలో తేడాలు ఉంటే చర్యలు తప్పవని రాజంపేట సబ్ కలెక్టర్ భావన అధికారులను హెచ్చరించారు. బుధవారం కోడూరు మండలంలోని బుడుగుంటపల్లి పరిధిలో ఉన్న స్టాక్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను పరిశీలించారు. వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. బియ్యం, చక్కెర నాణ్యతను పరిశీలించారు. డీలర్లకు అందించే బియ్యం తూకాల్లో తేడా వస్తే చర్యలు తప్పవన్నారు. స్కూల్ పిల్లలకు, గర్భిణులకు అందించే సరుకులు క్షుణ్ణంగా పరిశీలించి సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు తహశీల్దార్ కోనేటి అమర్నాథ్, గోడౌన్ డీటీ రెడ్డి ప్రసాద్, ఆర్ లక్ష్మీదేవి మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ భావన.

'జనసేన ఆశయ సాధనకు కలిసి పనిచేద్దాం..'

చిట్వేలి, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి) : జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయ సాధన కోసం అందరం కలిసి పనిచేద్దామని రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పిలుపుని చ్చారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఇటీవల పార్టీలో చేరిన రాజుకుంట యువ నాయకులు ఆనాల సునీల్ కుమార్, మాదినేని కనకరాజు, మాదినేని లోకేశ్ నాయకులు, కార్య కర్తలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ క్షేత్ర స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో చిట్వేలి మండలంలో తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు కృషి చేశామన్నారు. క్షేత్ర స్థాయిలో అందరిని కలుపుకుని పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రతి పోలింగ్ బూత్‌లో ఏజెంటును నిలిపే స్థాయికి ఎదగాలన్నారు. పార్టీలో చేరిన సునీల్, కనకరాజా, లోకేశ్ మాట్లాడుతూ అందరి సహకారంతో పార్టీని బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పార్టీలో చేరినవారిని శాలువాతో సత్కరించారు. జోగినేని మణి, పగడాల చంద్రశేఖర్, ఆలం రమేష్, ఏనుగుల జగన్‌మోహన్‌రాయల్, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట వైద్యులధర్నా

ఓబులవారిపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్, డీఎంహెచ్‌వో కార్యాల యాల ఎదుట ధర్నా చేసి నట్లు ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం ట్రెజరర్ డాక్టర్ జొన్నగడ్డల రాజశేఖర్ తెలిపారు. డైరెక్టర్ అండ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న జిల్లా గ్రామీణ వైద్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో పదోన్నతులు, ఇన్ సర్వీస్ పీజీ కోటా, నోషనల్ ఇంక్రిమెంట్, ట్రైబల్ అలవెన్స్ తదితర సమ స్యలు పరిష్కరించాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపా రు. తమ డిమాండ్‌లు నెరవేరే వరకు వెనక్కు వెళ్లే ప్రసక్తే లేదని, అక్టోబరు 3 నుంచి విజయవాడలో రిలే నిరాహార దీక్షలో పాల్గొంటామని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వైద్యులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలకు విరాళం

రాయచోటిటౌన్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా నిర్వహించనున్న చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు మోడెం వీరాంజనేయప్రసాద్ బుధవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు గ్రామం తొగటపల్లెలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఉత్సవానికి గానూ రూ.20 వేలు, చెర్లోపల్లి రెడ్డెమ్మ (సంతాన లక్ష్మి) ఆలయానికి రూ.20 వేలు లక్కిరెడ్డిపల్లె మండలం జాంద్రపల్లెలో జ్యోతి ఉత్సవాలకు రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల ఉత్సవాల నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రెండు లక్షల ఇన్సూరెన్స్ నగదు అందజేత

గాలివీడు, అక్టోబరు1 (ఆంధ్రజ్యో తి): ఖాతాదారుడు మరణించ డంతో అతని కుటుంబానికి రూ. రెండు లక్షల ఇన్సూరెన్స్ నగదు అందజేసినట్లు ఆంధ్రప్రగతి గ్రా మీణ బ్యాంక్ మేనేజర్ రమేశ్ బాబు తెలిపారు. చీమలచెరువు పల్లి పంచాయతీ కమలామర్రికి చెందిన ఎద్దుల చంద్రయ్యకు నూలివీడులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతా ఉండడంతోపాటు, పీఎంజేజేబీవై పథకం కింద ఇన్సూరెన్స్ తీసుకున్నాడని తెలిపారు. ఈయన మరణించడంతో నామినీగా ఉన్న అతని కుమారుడు ఎద్దుల రెడ్డెప్పకు ం ఇన్సూరెన్స్ నగదును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసి స్టెంట్ మేనేజర్ రాజా. బీసీలు సురే:శ్, బ్యాంకు సిబ్బంది శ్రీను పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట

గాలివీడు, అక్టోబరు1 (ఆంధ్ర జ్యోతి): ప్రస్తుత కేంద్ర ప్రభు త్వం అన్ని రకాల వస్తువులకు జీఎస్టీ తగ్గించడంతో పేద ప్రజలకు ఊరట లభించినట్లు అయ్యిందని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ తెలిపారు. జీఎస్టీ తగ్గింపు ఫలాల వివరాలు అందరికీ తెలిపేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.15 వేలు వరకూ ఆదా అవుతుంద న్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజల ఆర్థిక అభివృద్ధితో పాటు, మానవ వనరులు అభివృద్ధి చెందుతాయ న్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్నిశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి కస్తూరి, మాచినేని పూజలు

రైల్వేకోడూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.బుడుగుంటపల్లె వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, ప్ర ముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మహేశ్వరి, దేసూరి సుబ్రహ్మణ్యం భక్తు లకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఓం దుర్గాయై నమః

- మహిషాసురమర్దినిగా రెడ్డెమ్మతల్లి
- పీలేరులో రౌద్రాల అంకాలమ్మ
- బి.కొత్తకోటలో అలరించిన కోలాటం
- మదనపల్లెలో శోభాయమానంగా....



ప్రత్యేక అలంకరణలో కోర్టులో గంగమ్మ (మదనపల్లె)



బి.కొత్తకోటలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు - కోలాటం ఆడుతున్న మహిళలు

మూల ప్రకృతి అయిన లలితాదేవీ రూపాల్లో దుర్గామాత ఒకరు. అజేయ పరాక్రమాలతో మహిషాసురుడఅనే రాక్షసుడిని సంహరించేందుకు అవతరించిన స్వరూపం దుర్గాదేవి. శరన్నవరాత్రోత్సవాల్లో దుర్గాదేవి తొమ్మిది రూపాలైన నవదుర్గలను ఆరాధిస్తూ అమ్మవారిని పూజిస్తారు. ఆలయాల్లో అమ్మవారి మూల మంత్రంతో హోమాలు, పూజలు నిర్వహించారు.

మహిషాసురమర్దినిగా రెడ్డెమ్మ తల్లి

గుర్రంకొండ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు



నిమ్మనపల్లిలో....

బుధవారం మహిషా సుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. గు ర్రంకొండ పోలేరమ్మ అమ్మవారు మహిషాసు ర మర్దినిగా భక్తులను కరుణించారు. తరిగొం డ వాసవీ మాత మహిషాసుర మర్దినిగా భక్తులను కనువిందు చేశారు.

వాల్మీకిపురంలో భక్తుల సందడి

వాల్మీకిపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శరన్నవరాత్రోత్సవాలతో దేవాలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి. నల్లవీరగంగాభవాని, లక్ష్మీకామేశ్వరస్వామి, కన్య కాపరమేశ్వరిదేవి, బోయకొండ గంగమ్మ, గండబోయనపల్లె కోటలో వెలసిన సత్యమ్మ తల్లి, చింతపర్తి వాసవీ అమ్మవారి, గొల్లపల్లె విరూపాక్షమ్మతల్లి ఆలయాల్లో అమ్మవార్లను మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్న వితరణ చేపట్టారు.

దుర్గాదేవిగా చౌడేశ్వరి దేవి

కలకడ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కోన గ్రామంలో వెలసిన చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను కరుణించారు. అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో అలంకరించి పూజలను చేశారు.

మహిషాసురమర్దినిగా యల్లమ్మ

కలికిరి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కలికిరి గ్రామ దేవత యల్లమ్మ తల్లి మహిషాసురమర్దినిగా అవతరించింది. నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మహిషాసురమర్దినిగా రౌద్రాల అంకాలమ్మ

పీలేరు రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్య కాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహా చండిగా, యల్లమ్మదేవి, శివాలయంలోనూ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు.

ధనలక్ష్మీ దేవి నమోస్తుతే...

మదనపల్లె అర్బన్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరీదేవి ఆలయంలో ధనలక్ష్మీదేవి అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. కోర్టులో గంగమ్మకు పుష్పాలంకరణ చేశారు. కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో రాజరాజేశ్వరీ దేవిగా, సోమేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. రాజరాజేశ్వరీ ఆలయంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. బాట గంగమ్మ ఆలంయలో రాజరాజేశ్వరీగా భక్తులకు దర్శనం కల్పించారు. పురవీధుల్లో దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

కురబలకోటలో....

కురబలకోట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరీ అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మహిషాసురమర్దినిగా మాతమ్మతల్లి

నిమ్మనపల్లి అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దహరిజనవాడలో వెలసిన మాతమ్మతల్లి మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు ఖడ్గమాలదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వినూత్నంగా విజయదుర్గమ్మ

రామసముద్రం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాల్లో గ్రామ దేవతలు, శక్తి దేవతలను భక్తులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీరాములపల్లెలో విజయ దుర్గమ్మ దేవతను కూరగాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): శివాలయంలో కొలువు దీరిన పార్వతీ దేవి అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మహిషాసురమర్దినిగా దుర్గామాత

బి.కొత్తకోట, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): జ్యోతి సర్కిల్‌లో నిర్వహిస్తున్న నవరాత్రి వేడుకల్లో అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని స్తుతిస్తూ మార్వాడీ మహిళలు చేసిన కచేరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాత్రి కోలాటాలు అలరించాయి. ఆద్యంతం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పీటీఎం శివాలయంలో...

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాతకు కుంకుమార్చన నిర్వహించారు. దసరా ఉత్సవాలు ముగింపునకు చేరుకోవడంతో భక్తులు పోటెత్తారు. సాయంత్రం ఆలయంలో దుర్గామాతను కొలువు దీర్చారు.



కురబలకోటలో మహిషాసురమర్దిని అలంకరణ



తంబళ్లపల్లె శివాలయంలో మహాలక్ష్మీ అలంకరణ



కూరగాయల అలంకరణలో విజయదుర్గమ్మ



ములకలచెరువులో ఖడ్గమాలదేవి అలంకరణ



ఉగ్ర రూపంలో కలికిరి యల్లమ్మ

రాజకీయాలకు శ్రీనాథరెడ్డి గుడ్‌బై



పీలేరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి బుధవారం ప్రకటించారు. పీలేరు కోటపల్లెలోని ఆయన స్వగృహంలో బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఆరోగ్య, ఇతరత్రా కారణాల కారణంగా రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. తండ్రి, పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ చంద్రశేఖర రెడ్డి నుంచి రాజకీయ వారసత్వం అందిపుచ్చుకున్న జీవీ శ్రీనాథరెడ్డి న్యాయవాది వృత్తి నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించారు. చిన్నగొట్టిగల్లు సమితి అధ్యక్షుడిగా, చిత్తూరు జిల్లా జడ్పీ ఛైర్మన్‌గా, 1994-1999 మధ్య పీలేరు ఎమ్మెల్యేగా పనిచేశారు. రాష్ట్ర సెరికల్చర్ బోర్డు అధ్యక్షులుగా, ఏపీఎస్‌ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఉమ్మడి చిత్తూరు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. సౌమ్యుడు, వివాదరహితుడిగా పేరుపొందిన ఈయన టీడీపీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆ పార్టీకి పెద్దదిక్కులా వ్యవహరించారు. అయితే 2012లో పార్టీ వీడి అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మరలా 2015లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2021లో వైసీపీలో చేరారు. అప్పటి నుంచి గత సార్వత్రిక ఎన్నికల వరకు వైసీపీలో చురుగ్గా వ్యవహరించిన ఆయన ఎన్నికల ఫలితాల తరువాత నిస్తేజంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు బుధవారం ప్రకటించారు.

డ్రోన్ల వినియోగంతో బహుళ ప్రయోజనాలు

పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి



సబ్సిడీలో డ్రోన్‌ను రైతుకు అందిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి

పీలేరు రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం చిత్తూరు మార్గంలోని కోళ్లఫారం మిట్టన దేవిరెడ్డి వెంకట్రమణారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో 80 శాతం సబ్సిడీతో డ్రోన్‌ను రైతుకు అందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించి రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. ఆధునిక సాంకేతిక కలిగిన డ్రోన్ల ద్వారా విత్తనాలు విత్తడం, ఎరువుల పిచికారీ తదితర కార్యక్రమాలు కూలీలతో నిమిత్తం లేకుండా తక్కువ ఖర్చుతో రైతులు చేసుకోవచ్చని తెలిపారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ పద్దతులను మార్చుకోవాలని సూచించారు. తద్వారా అధిక దిగుబడులతో లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. రూ. 10 లక్షల విలువ చేసే డ్రోన్లను 80 శాతం రాయితీతో రైతులకు ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, కోటపల్లె బాబు రెడ్డి, పురం రామ్మూర్తి, వై. రెడ్డెప్ప రెడ్డి, ఎం. రెడ్డిబాష, శ్రీనాథరెడ్డి, నరేష్, బాబురెడ్డి, ఏడీఏ వై.వీ. రమణరావు, ఏఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నల్లగుట్టను మేతకు కేటాయించండి

- మూడు గ్రామాల రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నపం

మదనపల్లెటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అంకిశెట్టిపల్లె పంచాయతీ పరిధిలోకి వచ్చే నల్లగుట్టకు పశువుల మేతకు కేటాయించాలని మూడు గ్రామాల రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. బుధవారం సబ్‌కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు మాట్లాడుతూ దశాబ్దాలుగా అంకి శెట్టిపల్లె, వేంపల్లె, తుమ్మల తండా రైతులు పశువుల మేతకోసం నల్లగుట్టపైకి తోలుతున్నామన్నారు. ఇటీవల కొందరు అక్కడ బుద్ధుడి విగ్రహం పెట్టి తమ పశువులను అక్కడికి రానీయకుండా అడ్డు కుంటున్నారని ఆరోపించారు. నల్లగుట్లను పశువుల మేతకు తప్ప ఇతర కార్య క్రమాలకు అనుమతించవద్దని సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణికి వినతిపత్రం అందజేశారు.

జీఎస్టీని సద్వినియోగం చేసుకోండి



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న మహిళా సంఘాలు

నిమ్మనపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై భారం పడకుండా వుండేందుకు రూపొందించిన జీఎస్టీని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. బుధవారం జీఎస్టీ ద్వారా తగ్గిన వస్తువుల ధరల నమూనాను ముద్రించి వాటిని ప్రజలకు పంచుతూ అవగాహన కల్పించారు. ఆయన మాటాడుతూ జీఎస్టీ తగ్గుదల తరువాత చాలా రకాల వస్తువుల ధరల్లో మార్పులు వచ్చాయన్నారు. వీటిలో ఎక్కువగా నిత్యావసర సరుకులు చాలా చౌకగా వస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు తగ్గిన వస్తువు ధరను షాపుల ముందు డిస్‌ప్లే చేయాలని తెలిపారు. ఒక వేళ రేట్లు తగ్గించకుండా వస్తువులు అలాగే విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఏపీఎం మురళి, ఏఓ సుజాత మహిళా సంఘాలు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే

కలికిరి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరు, ఎస్పీగా బాధ్యతలను చేపట్టిన అధికారులను బుధవారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి రాయచోటిలో కలిశారు. మొదట కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని సమస్యలు, అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ప్రధానంగా నియో జకవర్గానికి హంద్రీనీవా నీళ్లు రాకుండా అడ్డంకిగా వున్న శ్రీనివాసపురం జలాశయం కాలువలకు అవసరమైన కేవలం ఆరు ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అడవిపల్లె రిజర్వాయర్‌కు నీటిని చేర్చేందుకు అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని ఆయన కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ చిన్న సమస్య పరిష్కారమైతే నియోజకవర్గంలోని 85 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. అనంతరం ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని శాంతిభద్రతల నిర్వహణపైచర్చించారు.

ప్రభుత్వాస్పత్రిలో కాన్పు తల్లీబిడ్డకు క్షేమం

వాల్మీకిపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫి పేర్కొన్నారు. చింతపర్తి పీహెచ్‌సీ గండబోయనపల్లె ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో స్వస్తనారి స శక్త్ పరివార్ అభియాన్‌లో ఆయన మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ సేవలపై, అందరికీ క్యాన్సర్ పరీక్షలు, క్షయ, వృద్ధుల పట్ల పాటించాలని జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, వైద్య చికిత్స కూడా పొందాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వాహన సదుపాయం తదితర విషయాలను తెలియజేశారు. సీహెచ్‌ఓ అరుణ, సూపర్‌వైజర్లు బహుద్దీన్, బానుబీ, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి కొత్త టీచర్లకు శిక్షణ



గ్రీన్‌వ్యాలీ హైస్కూల్లో ఏర్పాట్ల సూచనలిస్తున్న డీవైఈఓ

మదనపల్లెటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన 360 మంది కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు పొందిన వారికి రేపటి నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మదనపల్లె డీవైఈఓ లోకేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గ్రీన్‌వ్యాలీ హైస్కూల్లో నిర్వహిస్తున్న ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ డీఈఓ సుబ్రహ్మణ్యం ఆదేశాలతో కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వస్తున్న వారికి ఎనిమిది రోజులు ఇక్కడ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. వీరికి కోర్సు డైరెక్టర్లుగా కరుణాకర్, పలువురు ఎంఈఓలు వ్యవహరిస్తారన్నారు. ఎనిమిది రోజుల పాటు ఇచ్చే శిక్షణకు తరగతి గదులు, ఇతర సౌకర్యాలను గుర్తించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. రిసోర్స్ పర్సన్‌లు మహమ్మద్‌ఖాన్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ అజెండా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ కౌన్సిలర్ల అజెండాగా పనిచేస్తున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ తప్పుపట్టారు. బుధవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2021లో అధికార మదంతో మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను కనీసం నామినేషన్ కూడా వేయనీయకుండా అక్రమంగా అధికారంలోకి వచ్చిన వైసీపీ కౌన్సిలర్లు మూడేళ్ల పాటు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ మున్సిపల్ కాంట్రాక్టు పనుల్లో కాంట్రాక్టర్లను బెదిరించి వారి నుంచి కమిషన్లు దోచుకున్నారన్నారు. ఏడాదిన్నరగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే షాజహాన్‌బాష పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి పనులను అజెండాలో పెట్టిస్తుండడంతో వైసీపీ కౌన్సిలర్లు ఓర్వలేకపోతున్నారన్నారు. వరుసగా ఆరు నెలల నుంచి ఎమ్మెల్యే ప్రతిపాదించిన పనులను అజెండాలో వుంచినా వాటికి ఆమోదం తెలపకుండా వ్యతిరేకిస్తున్నారన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న వైసీపీ కౌన్సిలర్లు తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన ఐదు నెలలైనా ప్రజాసమస్యలు పరిష్కారం కోసం, అభివృద్ధి పనులు నిర్వహించేలా వైసీపీ కౌన్సిలర్లు సహకరించాలని, లేకుంటే వీరికి పట్టణ ప్రజలే తగిన బుద్ధిచెబుతారని ఆయన హెచ్చరించారు.

ప్రాణహాని ఉందంటూ.. మహిళ ధర్నా



భర్త మహబూబ్‌ఖాన్ ఇంటి ముందు ధర్నా చేస్తున్న జోయాఖాన్

మదనపల్లెటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): 'నా భర్త వేధింపులు భరించలేకున్నాను. రోజూ హింసిస్తూ వేధిస్తున్నాడు. ప్రశ్నిస్తే ఇంటి నుంచి బయటకు గెంటేసి, ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లి పోయా'డంటూ ఓ మహిళ భర్త ఇంటి ముందే ధర్నాకు దిగింది. బాధితురాలి కథనం మేరకు.. మదనపల్లె పట్టణం ఎన్‌వీఆర్ వీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా, నసీబ్‌జాన్ దంపతుల కుమార్తె జోయాఖాన్‌కు 12 ఏళ్ల కిందట మదనపల్లె వాసి మహబూబ్‌ఖాన్‌తో వివాహమైంది. ఎస్‌బీఐ కాలనీలో కాపురమున్న వీరికి షఫియాఖాన్ అనే కుమార్తె వుంది. ఈ క్రమంలో రెండేళ్లుగా మహబూబ్‌ఖాన్ ఇంటికి సక్రమంగా రాకపోవడమే కాక, మరో మహిళతో చనువుగా వుండటాన్ని అతని భార్య జోయా నిలదీసింది. అప్పటి నుంచి వీరి మధ్య గొడవలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మహబూబ్‌ఖాన్ తనను వీధిలోనే తీవ్రంగా కొట్టి ఇంటి నుంచి బయటకు గెంటేశాడని ఆరోపించింది. అంతేకాకుండా ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లిపోయాడని బాధితురాలు జోయాఖాన్ బుధవారం భర్త ఇంటి ముందు ధర్నాకు కూర్చుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను భర్త కుక్కకన్నా హీనంగా చూస్తున్నాడని, ప్రశ్నిస్తే చితకబాదుతున్నాడని వాపోయింది. ఈ విషయమై టూటౌన్ పోలీ సులకు ఫిర్యాదు చేస్తే భర్తతో సర్దుకుపోవాలని చెబుతున్నారని ఆవే దన వ్యక్తం చేసింది. తన భర్త ఓ టీడీపీ నేత ప్రధాన అనుచరుడిగా వున్నాడని, అందుకే తనను బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై టీడీపీ అధిష్ఠానం కలుగజేసుకుని తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

నేడు గోపిదిన్నెలో రెవెన్యూ గ్రామ సభ

తంబళ్లపల్లె, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గోపిదిన్నె సచివాలయంలో గురువారం భూ రీ సర్వే గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి గోపిదిన్నె పంచాయతీలో భూ రీ సర్వే నిర్వహిస్తామన్నారు.









అవ్వాతాతలకు అండగా 'కూటమి'

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే

కలికిరి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటోవ తేదీనే ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్లు అందజేసి అవ్వాతాతలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. పత్తేగడ పంచాయతీలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. పింఛను తీసుకుంటున్న వారందరినీ పేరు పేరునా పలకరించారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం గురించి మహిళలను విచారించారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కల్పన రెడ్డి పంపిణీ

ములకలచెరువు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగుట్టలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మహిళా నేత దాసరిపల్లి కల్పనరెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. దేవళ చెరువులో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాతరాజు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారామణ, టీడీపీ నేతలు ఎర్రగుడి సురేష్, కేవీ రమణ, నేతలు కట్టా హరినాధ్, సత్యనారాయణ, పాల రాము, నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో....

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన అందిస్తున్న పెన్షన్లు పేదలకు వరం లాంటిదని తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డి సతీమణి కల్పనారెడ్డి అన్నారు. బుధవారం ఆమె పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం సంతబజారులో మంచినీటి పథకంలో భాగంగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభించారు. సర్పంచ్ తమక శంకర, మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్‌బాబు, టీడీపీ సీనియర్ నేతలు కట్టా సురేంద్ర నాయుడు, సంపతి కోట కిట్టన్న, నందిమూర్తి, మద్దయ్యగారిపల్లె మాజీ సర్పంచ్ నరసింహులు, స్కూల్ కమిటీ చైర్మన్ రాము, కుమ్మరవారిపల్లె రాజేష్, కుమ్మర భాస్కర్ వెలుగు సభ్యులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో....

బి.కొత్తకోట, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): సూరపువారిపల్లె పంచాయతీలో బుధవారం టీడీపీ ఇన్‌చార్జి సతీమణి దాసరిపల్లి కల్పనారెడ్డి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దన్న పాత్ర పోషిస్తూ అవ్వ, తాతలను, వికలాంగులు, వితంతువులను పింఛను సొమ్ముతో ఆసరాగా నిలుస్తున్నారన్నారు. ఎంపీడీఓ అబ్దుల్ షకూర్, కూటమి నేతలు మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. కల్పనారెడ్డితో దుర్గారెడ్డి, అంజి, శివశంకర్, జగదీష్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం


వాల్మీకిపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. జర్రావారిపల్లెలో కూటమి నేతలతో కలిసి పింఛన్ల పంపిణీ చేపట్టారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం సంక్షేమం కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసే దిశగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, జనసేన ప్రభాకర్, కూటమి నేతలు, పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

మదనపల్లె, అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న వారిని ఏజన్సీ మారడంతో తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ రమేశ్‌ను కలవడానికి వచ్చిన కార్మికులను చులకనగా మాట్లాడారని ఈయన కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి బైఠాయించారు.

అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పీలేరు రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతం కాలనీ వద్ద యల్లమ్మదేవి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. బుధవారం తెల్లవారుజామున 4.30 నుంచి ఆలయ కమిటీ చైర్మన్ దేవిరెడ్డి వెంకట్రమణారెడ్డి ఆధ్వర్యంలో పూజ నిర్వహించారు. ఆధునిక వసతులతో అమ్మవారి ఆలయం నిర్మిస్తున్నామని తెలిపారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. కమిటీ సభ్యులు శెట్టిసుబ్రమణ్యం, చంద్రారెడ్డి, పోతంశెట్టి రమేష్, నారాయణరెడ్డి, రఘు, రాజా, అర్చకులు శ్రీనివాస దీక్షితులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.











ట్రాక్టర్‌కు నిప్పు పెట్టిన దుండగులు

పెద్దమండ్యం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం రైతు తెచ్చు కున్న ట్రాక్టర్‌కు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టిన సంఘటన పెద్దమండ్యం మండలంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు దిగువపల్లి వాసి దయానందరెడ్డి వ్యవసాయ అవసరాల కోసం ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. పనులు ముగించుకుని ఇంటి సమీపంలో ట్రాక్టర్ నిలిపాడు. మంగళవారం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం నిద్ర లేవగా ట్రాక్టర్‌కు గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టి పరుగులు తీయడం గమనించి, ఆ మంటలను నీళ్లతో ఆర్పినట్లు బాధిత రైతు పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దమండ్యం ఇన్‌చార్జ్, తంబళ్లపల్లి ఎస్‌ఐ ఉమా మహేశ్వర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూ టీమ్ ఆ ప్రాంతాన్ని తనిఖీ చేపట్టారు. ఈ సంఘటనపై పోలీసులు ఆరా తీశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఇసాక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డయాలసిస్ కేంద్రం పరిశీలన

మదనపల్లె అర్బన్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను బీజేపీ నేతలు పరిశీలించారు.అదనపు బెడ్లు కావాలని కోరాడంతో మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.బీజేపీ జాతీయ నేత చల్లపల్లె నరసింహారెడ్డి మాట్లాడుతూ ఏ సమస్య లున్నా మంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. బీజేపీ నేతలు మాజీ పట్టణా . ధ్యక్షుడు బర్నేపల్లె రవి కుమార్, డాక్టర్ అంజముతుల్లా ఖాన్, విజయ భారతి సేతు, కోసూరి భగవాన్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్‌కు జనసేన నేతల సన్మానం

పీలేరు రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయిప్రసాద్‌ను ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కలప రవి ఆధ్వర్యంలో సన్మానించారు. పీలేరు నుంచి ఐదు వా హనాల్లో జనసేన నేతలు శ్రీకాళహస్తికి వెళ్లి ఆలయ చైర్మన్‌ను సన్మానించారు. పీలేరు జనసేన పార్టీ ఇన్‌చార్జి బెజవాడ దినేష్, ఏఎంసీ డైరె క్టర్ గోళ్ల కిషోర్ నాయుడు, పీలేరు జనసేన కార్యదర్శి రాజేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం:ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యం గా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే షాజహా న్‌బాష అన్నారు. వలసపల్లె పంచాయతీ పరిధిలోని సబ్ స్టేషన్ వద్ద రూ.2కోట్లతో ఏర్పా టు చేసిన పవ ర్‌ట్రాన్స్ ఫార్మ ర్‌ను స్విచ్‌ఆన్ చేసి ఆయన ప్రారంభించారు. ఎస్పీడీసీఎల్ ఈఈ గంగా ధరం, ఎంఆర్‌టీ ఈఈ విజయ్ భాస్కర్, ఏడీఈలు హరికుమా ర్, ఆది నారాయణ, ఏఈ లు బాలసుబ్ర మణ్యం, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

భూమి పూజ

ఉపాధి కింద మం జూరైన రూ.1.10 కోట్ల విలువైన సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాష భూమి పూజ చేశారు. ఈశ్వ రమ్మ కాలనీ పంచా యతీ, కోళ్లబైలు పంచా యతీలో సీసీ రోడ్ల నిర్మా ణానికి శ్రీకారం చు ట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మ స్రూర్, పీఆర్ ఏఈ రమణ, ఉపాధి ఏపీఓ చెన్నకేశవులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేతల దసరా శుభాకాంక్షలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాష, తెలుగు యువత రాష్ట్ర అధ్య క్షుడు శ్రీరాంచినబాబు, తంబళ్లపల్లె టీడీపీ సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, మాజీ ఎమ్మెల్యే దొమ్మల పాటి రమేష్, జనసేన నేత గంగారపు రాందాస్ చౌదరి, టీడీపీ సమన్వ యకర్త మార్వారి సుధాకర్ నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్, జంగాల శివరామ్, మైనార్టీ నేతలు మస్తాన్, పఠాన్ ఖాదర్ ఖాన్, జనసేన శ్రీరామ రామాంజ నేయు లు, బీజేపీ నేత శ్రీనివాసులు తదితరులు వీరిలో ఉన్నారు.

పెన్షన్ల పంపిణీలో మొదటి స్థానం

నిమ్మనపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్లు, ఇతర పెన్షన్ల పంపిణీలో జిల్లాలో నిమ్మనపల్లికి మెదటి స్థానం దక్కిందని ఎంపీడీఓ రమేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 5053పెన్షన్లకు 4847పెన్షన్లను సచివాలయ ఉద్యోగు లు ఉదయం 7గంటల నుంచి పంపిణీ చేసినట్లు తెలిపారు.

కాలువలో పడి యువకుడి మృతి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాల్వలో పడి యువకుడు కిషోర్‌రెడ్డి(32) మృతి చెందిన ట్లు పోలీసులు తెలిపారు. ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటనపై బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల్లోకెళితే.... పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీ రింగ్ కళాశాలలో కడప వాసి ఆర్.కిషోర్‌రెడ్డి స్టోర్ కీపర్ గా పనిచేస్తున్నాడు. కళాశాల శెలవులు ఇవ్వడంతో సో మవారం మధ్యాహ్నం మిత్రులతో కలిసి హంద్రీ-నీవా కాల్వ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృత్యువాత పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమచా రం అందించారు. మృతుని బంధువులు సంఘటన స్థలా నికి చేరుకుని మృతదేహాన్ని కడపకు తరలించారు. పోలీసులను విచారించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

శాస్త్రి వీధిలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విజయదశమిని పురస్కరిం చుకుని పట్టణంలోని శాస్త్రి వీధిలో ఏర్పాటు చేసిన దుర్గమ్మకు స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన కనకదుర్గ మ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

Government of India,
Ministry of Home Affairs,
SASHASTRA SEEMA BAL,
Office of the Commandant,
9th Bn, SSB, Balrampur (Uttar Pradesh) PIN-271201.
9th Bn Control Room- 9415115626,
(email: control.9thbn@ssb.gov.in)
File No.PF/CT(GD)/P.R./09 Bn/SSB/Blpr/2025/-17845-57

Dated:-29/09/2025

To,
UIN-12080830, CT(GD) Pullaganti Ramesh,
S/o Sh. P. Sreenivasulu,
Village-Thummachatalla Palli, P.O-Angallu, P.S-Mudivedu, Teh & District-Chittoor, State-Andhra Pradesh, PIN Code-517325.
Mob. No.06361166144
(Mail ID:- shrikanth19sri@gamil.com & pullaganti.12080830@ssb.gov.in)

SUBJECT:-SHOW CAUSE NOTICE UNDER RULE-21 .

1.Whereas, while posted in 9th Bn, SSB you absented yourself without leave w.e.f.29.04.2025 (AN).

2.Whereas,a letter has been issued vide letter No.PF/CRC/CT/GD/PR/09 Bn/SSB/2024/-7087-89 dated 09.05.2025 and No.PF/CRC/CT/GD/PR/09 Bn/SSB/2025/-7737-39 dated 20.05.2025 at your home/correspondence with direction to join your duties but you failed to report in 09th Bn, SSB, Balrampur.

3.Whereas, you are absenting yourself without leave since 04 months without sufficient cause and have not reported to 09th Bn SSB Balrampur despite reminders.

4.Whereas, the Court of Inquiry under Section-74 of the SSB act was conducted to enquire into the aforesaid absence and the said Inquiry declared your said absence as unauthorised.

5.Whereas, Apprehension Roll was issued to concerned Police authority to apprehend you vide letter File No.-PF/CT(GD)/P.R./09Bn/SSB/Blpr/2025/ 15663-68 dated 26.08.2025 and File No.-PF/CT(GD) /P.R./09Bn/SSB/Blpr/2025 /-16116-20 dated 03.09.2025. You have not reported for duty after the said declaration by the Court of Inquiry and also not surrendered or apprehended by the Police as such you are deemed to be a deserter vide this office Order No.PF/CT(GD)/P.R./09Bn /SSB/Blpr/2025/-16699-704 dated 11.09.2025 within the ambit of Section-74 of the said Act and the said offence is punishable under SSB Act 2007.

6.Whereas, in the facts and circumstances of the case, the undersigned is satisfied that your trial by Force Court for the said offence of desertion under the SSB Act is inexpedient and impracticable, and is of the tentative opinion that your further retention in the service is undesirable.

7.Whereas, a Show Cause Notice along with copies of the Court of Inquiry proceedings, was served upon you vide this office letter No. PF/CT(GD)/P.R./09 Bn/SSB/Blpr/2025/16809-20 dated 13.09.2025 wherein you were directed to submit your explanation and defence regarding the said allegations by 28.09.2025, stating why disciplinary action in the form of dismissal or removal from service should not be initiated against you under Rule-21 of the SSB Rules, 2009, for the alleged misconduct. However, till date, you have neither submitted any reply in your defence nor reported for duty at 09th Bn, SSB, Balrampur.

8. In view of the above, you are hereby called upon to submit in writing your explanation and defence in respect of above allegations(s) by **14.10.2025**as to why action to dismiss or remove you tentatively from service for said mis-conduct should not be initiated against you under Rule-21 of the SSB Rules 2009. In case, you fail to file any reply within the stipulated period, it shall be presumed that you have nothing to put forth in your defence and action to terminate your services as proposed above within the ambit of SSB Rule-21 shall be initiated against you ex-parte.

Sd/- Commanding Officer
9th Bn, SSB Balrampur (UP)

Copy to,
The District Magistrate, District-Chittoor (Andhra Pradesh) Pin-517001 Mail:- collectorchittoor@gmail.com. For information and necessary action please.
The Superintendent of Police, District-Chittoor (Andra Pradesh) Pin-517001 Mail:-sp-chittoor@ap.gov.in. For information and necessary action please.
The Commandant (Pers-II), Force HQ, SSB, New Delhi: For information please.
The Addl. JAG, FTR, HQ, SSB, Lucknow : For information please.
The Commandant(Admn) Sector HQ, SSB, Gorakhpur : For information please.
The SHO Police Station-Mudivedu (Andhra Pradesh) Pin-517350 Mail:- shomudivedups@gmail.com : For information and necessary action please.

Internal :-
Inspector(Admn). 2. Account Branch. 3. QM Branch. 4. SRC 5. F.O Clerk.

Sd/-Commanding Officer
9th Bn, SSB Balrampur (UP)